క్లుప్తంగా

సైనిక్ స్కూల్‌కు ఎంపిక


మేఘచరణ్

సరుబుజ్జిలి: ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ 9వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో స్థానిక వెంకటసాయి విద్యా సంస్థల నుంచి కుప్పు మేఘచరణ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బెండి పురుషోత్తమరావు శనివారం తెలిపారు. ఈ విద్యార్థి ఆలిండియా ర్యాంకులో విజయనగరం జిల్లా కోరుకొండ సైనిక స్కూల్‌లో 9వ తరగతి సీటుకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఎంపిక పట్ల విద్యా సంస్థల కరస్పాండెంట్ కూన జగన్నాథం, అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

దళిత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు



పొందూరు: దళిత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడిగా సాకేటి నాగరాజు ఎన్నికయ్యారు. దళిత ఐక్యవేదిక సర్వసభ్య సమావేశాన్ని పొందూరులోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించారు. ఐక్యవేదిక వ్యవస్థాపకుడు కల్లేపల్లి రాంగోపాల్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా బొచ్చ బుద్ధుడు, ఉపాధ్యక్షులుగా గూన కృష్ణ, కుమిలి రాజేష్, ప్రధాన కార్యదర్శిగా రాకోటి నందేష్, కార్యదర్శులుగా గొంప ప్రసాదరావు, కోశాధికారిగా నల్లబారికి అప్పారావు ఎన్నికయ్యారు. అధ్యక్షుడు సాకేటి నాగరాజు మాట్లాడుతూ దళితుల సమస్యల పరిష్కారానికి, అభ్యున్నతికి కృషి చేస్తానని చెప్పారు.

ఎన్‌సీసీ శిబిరానికి 50 మంది ఎంపిక


ఎన్‌సీసీ శిబిరానికి ఎంపికైన ఆమదాలవల విద్యార్థుల

ఆమదాలవలస: జిల్లాలోని టెక్కలి ఆదిత్య కళాశాలలో నిర్వహించినున్న ఎన్‌సీసీ ప్రత్యేక శిబిరానికి 50 మంది విద్యార్థులు ఎంపికైనట్లు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.ఎ.రాములు శనివారం తెలిపారు. ఆమదాలవలస మండలం, మున్సిపాలిటీకి చెందిన విద్యార్థులు మే 31 నుంచి జూన్ 9వ తేదీ వరకు జరిగే క్యాంపులో పాల్గొని శిక్షణ పొందడం జరుగుతుందన్నారు. ఈ మేరకు ప్రత్యేక బస్సులో 50 మంది విద్యార్థులను ఎన్‌సీసీ మొదటి అధికారి ఎం.మోహన్ రావు, ఎన్‌సీసీ రెండో అధికారిని బి.శరత్ కుమారి పర్యవేక్షణలో పంపించడం జరిగిందన్నారు.

గోతిలో పడిన వ్యాన్


కాలువ నిర్మాణం కోసం తవ్విన గోతిలో పడిన వ్యాన్

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి ఒకటో వార్డు పార్వతీశుని పేట జంక్షన్ సమీపంలోని గోతిలో వ్యాన్ అదుపుతప్పి పడింది. ఈ సంఘటన శనివారం జరిగింది. సీఎస్పీ రోడ్డు నుంచి ఏబీ రోడ్డు వరకు, పాలకొండ రోడ్డు నుంచి హిరమండలం రోడ్డును కలిపే లింక్ రోడ్డు పక్కన కాలువ తవ్వి నిర్మాణం చేపట్టకుండా విడిచిపెట్టారు. ఈ రహదారిలో ఉదయం 9 గంటల సమయంలో వ్యాన్ సీఎస్పీ రహదారికి వెళుతున్న సమయంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కాలువలో దిగిపోయింది. డ్రైవర్ చాకచక్యంగా ఉండటంతో ప్రమాదం లేకుండా తప్పించుకున్నాడు. ఆ సమయంలో వ్యాన్‌లో మనుషులు, వస్తువులు లేవు. గడచిన కొద్ది రోజులుగా కాలువ తవ్వి విడిచిపెట్టడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా పురపాలక సంఘ అధికారులు కాలువ పనులను పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

ప్రకృతి సాగుతో మేలు

ఆమదాలవలస: ప్రకృతి వ్యవసాయంలో పంటల సాగు రైతులకు మేలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పూజారి సత్యానారాయణ అన్నారు. శనివారం మండల కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ముందస్తు రుతు పవనాలు రాక రైతులకు మేలు చేస్తాయన్నారు. రైతులందరూ తప్పకుండా ప్రకృతి వ్యవసాయ సాగును చేయాలని సూచించారు. ఖరీఫ్‌లో రైతులందరూ కూడా జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగును చేపడతారని, వరి పంట వేయడానికి ముందుగా ప్రకృతి పద్ధతిలో నవధాన్య సాగును చేపట్టాలన్నారు. నేల, పంటకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం వలన నేల, వాతావరణానికి ఎటువంటి హాని కలగకుండా స్వచ్ఛమైన పంటలను సమాజానికి అందించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు.. అంతా బూటకమే..!

- దివ్యాంగుల పింఛన్ల కత్తిరింపు చర్యల పట్ల ఆందోళన
- స్పౌజ్ పింఛన్లకూ దిక్కులేదు
- 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్ ఒట్టిమాటే
- 60 దాటిన అర్హులకు పింఛన్లు ఇచ్చే పరిస్థితి లేదు..



కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో 50 ఏళ్లకే బీసీలకు పింఛన్ అని ప్రకటించిన డిక్లరేషన్


సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు నరసన్నపేట ఆస్పత్రికి వచ్చిన దివ్యాంగులు(ఫైల్)

నూతన పింఛన్లకు 50 నుంచి 59 ఏళ్ల వయస్సున్న అర్హులు	
నియోజకవర్గం	అర్హులు
నరసన్నపేట	17,171
ఆమదాలవలస	15,575
పాతపట్నం	17,821



నరసన్నపేట: ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా నూతన పింఛన్ల మంజూరు ఊసే కూటమి ప్రభుత్వం ఎత్తడం లేదు. కనీసం దరఖాస్తు చేసుకోవడానికి కూడా వెబ్‌సైట్ ఓపెన్ చేయడం లేదు. దీంతో అర్హత కలిగిన పింఛన్‌దారులందరూ ప్రభుత్వ ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. ఏడాది కావస్తున్నా.. కొత్త పింఛన్లు ఇవ్వక పోగా.. స్పౌజ్ పింఛన్లు కూడా మంజూరు చేయకపోవడం కూటమి ప్రభుత్వానే చెల్లింది. వృద్ధాప్య పింఛన్ వస్తూ భర్త చనిపోతే వెంటనే భార్యకు వితంతు పింఛన్‌ను గత ప్రభుత్వంలో మంజూరు చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.


నరసన్నపేట జగన్నాథపురంలో ఒకేచోట పింఛన్ ఇస్తున్న దృశ్యం

మేనిఫెస్టోలో 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని డిక్లరేషన్

ఎన్నికల ముందు టీడీపీ మేనిఫెస్టో విడుదల చేసింది. దీంట్లో బీసీలకు 50 సంవత్సరాలకే రూ.4 వేల పింఛన్ ఇస్తాం స్పష్టంగా ప్రకటించింది. ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీలకు 50 ఏళ్లు దాటితే పింఛన్ మంజూరు చేస్తామని డిక్లరేషన్ ప్రకటించింది. ఈ ఏడాది కాలంలో ఒక్క అడుగూ ముందుకు వేయలేదు. ఇంకెప్పుడు కొత్త పింఛన్లు మంజూరు చేస్తారని అర్హులు ప్రశ్నిస్తున్నారు.

ప్రతీ ఆరు నెలలకూ కొత్త పింఛన్లు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఆరు నెలలకూ కొత్త పింఛన్లు అందేవి. సచివాలయాల్లో 24 గంటలూ పింఛన్ల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవడానికి వెబ్‌సైట్ పనిచేసేది. పింఛన్ పొందుతూ భర్త మరణిస్తే ఆ మరుసటి నెలలోనే భార్యకు వితంత పింఛన్ వచ్చేది. వికలాంగులుతోపాటు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

దివ్యాంగుల్లో గుబులు..

దివ్యాంగులకు ఈ ప్రభుత్వం పింఛన్ ఆరు వేలు చేసింది. అధికారం చేపట్టినప్పటి నుంచి దివ్యాంగులకు ఇచ్చే పింఛన్‌లో ఎలా కోతలు వేయాలనే ఆలోచనలోనే ఉంది. ప్రస్తుతం దివ్యాంగ పింఛన్లు పొందుతున్న వారికి సదరం పేరుతో సర్టిఫికెట్లు పునః పరిశీలన చేయిస్తోంది. దీంట్లో సగానికి పైగా కోత విధించాలని చూస్తోంది. పూర్తి దివ్యాంగత్వం ఉంటే రూ.15 వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఇది ఇప్పటివరకు అమలు కాలేదు. దీంతో దివ్యాంగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

గడపగడపకూ పింఛన్ వెళ్లి ఇవ్వడం లేదు..

గత ప్రభుత్వ హయాంలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి తలుపు తట్టి పింఛన్ ఠంచన్‌గా ఇచ్చేవారు. అనారోగ్యంతో ఉంటే ఆస్పత్రికి వెళ్లి అందజేశారు. నేడు ఆ పరిస్థితిలేదు. వీధుల్లో ఒకచోట ఉండి పింఛన్లు ఇస్తున్నారు. ఏమంటే సర్వర్ పనిచేయడం లేదు, సిగ్నల్ లేదు అంటున్నారు.

నరసన్నపేట నియోజకవర్గం..		
మండలం	కూటమి హయాంలో	వైఎస్సార్‌సీపీ హయాంలో
నరసన్నపేట	10,396	11,002
జలుమూరు	9,310	9,625
పోలాకి	9,822	10,100
సారవకోట	8,157	8,320
ఆమదాలవలస నియోజకవర్గం..		
ఆమదాలవలస	7,325	7,900
ఆమదాలవలస అర్బన్	4,691	4,860
బూర్జ	7,265	7,500
పొందూరు	10,867	11,200
సరుబుజ్జిలి	5,162	5,250
పాతపట్నం నియోజకవర్గం		
పాతపట్నం	9,720	10,031
హిరమండలం	5,802	5,969
కొత్తూరు	10,513	10,886
ఎల్.ఎన్.పేట	5,263	5,468
మెళియాపుట్టి	8,502	8,823


ఉర్లాంకు చెందిన పింఛన్‌దారు గొండు నర్సమ్మకు కేజీహెచ్‌కు వెళ్లి పింఛన్ ఇస్తున్న వలంటీర్ (ఫైల్)

పింఛన్ వచ్చేది ఎప్పుడు?



ఈ ఫొటోలో కనిపిస్తున్న ఆమె పేరు ఊట జయలక్ష్మి, చింతలబడవంజ గ్రామం, ఎల్.ఎన్.పేట మండలం. ఈమె భర్త ఊట దాలినాయుడుకు వృద్ధాప్య పింఛన్ వచ్చేది. ఈయన ఏడాది క్రితం మృతి చెందాడు. వింతంతు పింఛన్ ఇవ్వాలని కోరుతూ గ్రామ సచివాలయం, మండల పరిషత్ కార్యాలయం, జిల్లా కలెక్టర్ ఫిర్యాదుల విభాగంతో పాటు ఎంతో మందికి ఫిర్యాదు చేసుకుంది. ఈమెకు ఏడాదిగా పింఛన్ మంజూరు కాలేదు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ వింతంతు పింఛన్ ఎప్పుడు వస్తుందా? అని ఆమె కనిపించిన వారందరినీ అడుగుతూ.. ఎదురు చూస్తోంది.
– ఊట జయలక్ష్మి, చింతలబడవంజ, ఎల్.ఎన్.పేట మండలం

మాకు ఎందుకీ కష్టాలు



పోలియో కారణంగా రెండు కాళ్లు, చేతులూ పనిచేయవు. చాలా ఏళ్లుగా దివ్యాంగుల పింఛన్ వస్తుంది. 80 శాతం వికలాంగత్వంపైనే సర్టిఫికెట్ ఉంది. అయినా సర్టిఫికెట్ పరిశీలన పేరుతో ఇబ్బంది పెడుతున్నారు. 40 కిలోమీటర్ల దూరం నుంచి నరసన్నపేట ఆస్పత్రికి వెళ్లాను. నాలాంటి వారికి రూ.15 వేలు పింఛన్ ఇస్తామన్నారు. ఇప్పుడు వస్తున్న పింఛన్ నిలిపేస్తారని అంటున్నారు. ఈ వయసులో మాకు ఎందుకీ కష్టాలు.
– బొంగు లక్ష్మీనారాయణ, కరకవలస, జలుమూరు మండలం

వస్తున్న పింఛన్ నిలిపేశారు



నేను ఒంటరి మహిళను. గత కొన్నేళ్లుగా ఒంటరి మహిళ పింఛన్ వచ్చేది. గడిచిన నాలుగు నెలలుగా పింఛన్ నిలిపేశారు. కలెక్టర్‌తోపాటు పలువురు అధికారులను కలిశాను. పింఛన్ పునరుద్ధరించలేదు. అన్యాయంగా నా పింఛన్ నిలిపివేశారు.
– వెలమల శకుంతల, రావులవలస, నరసన్నపేట మండలం

ఏడాదిన్నరగా పింఛన్ అందడంలేదు



నా భర్త శాంతారావు మరణించి ఏడాదిపైనే అవుతుంది. వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేశాను. ఇదిగో, అదిగో అంటున్నారు. పింఛన్ మాత్రం అందడం లేదు. అసలు మంజూరే కాలేదు. కుటుంబపరంగా ఆర్థిక ఇబ్బందులతో ఉన్నాను. పింఛన్ అందితే కొంతైనా కుటుంబ పోషణకు వీలు అవుతుందని ఆశిస్తున్నాను.
– కుంచి పున్నమ్మ, చిన్నబొరిగివలస, నరసన్నపేట మండలం

పింఛన్ మంజూరుచేసి ఆదుకోవాలి



నాకు 62 సంవత్సరాలు అవుతుంది. ఇంతవరకు వృద్ధాప్య పింఛన్ మంజూరు కాలేదు. పింఛన్ మంజూరు కోసం సచివాలయం చుట్టూ తిరుగుతున్నాను. నేటికీ పింఛన్ మంజూరు కాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాను. నాకు ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి. – బగాది నారాయణమూర్తి, వృద్ధుడు, కాశపర్తి, బూర్జ మండలం

ఏడాదైనా పింఛన్ రాలేదు



నా పేరు దల్లి ఎంకమ్మ. నా వయస్సు 70 ఏళ్లు. నా భర్త చనిపోయి ఏడాది గడిచింది. దరఖాస్తు చేసుకుని ఏడాది అయింది. ఇప్పటివరకు వితంతు పింఛన్ మంజూరు చేయలేదు. ఇప్పటికైనా పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి.
– దల్లి ఎంకమ్మ, దల్లిపేట, పొందూరు మండలం

పింఛన్ మంజూరు కాలేదు



నా భర్త పున్నయ్యకు వృద్ధాప్య పింఛన్ వచ్చేది. ఆయన మరణించి ఆరు నెలలు పైనే అవుతుంది. స్పౌజ్ కోటాలో వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేశాను. ఐదు నెలలు అవుతుంది. ఇప్పటికీ పింఛన్ మంజూరు కాలేదు. ఇప్పటికై నా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.
– తోనంగి అప్పలనర్సమ్మ, బొరిగివలస కాలనీ, నరసన్నపేట మండలం

రాఘవరావుకు అభినందన


రాఘవరావును అభినందిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య, నాయకులు

పోలాకి: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమితులైన చింతు రాఘవరావుకు పార్టీ బీసీసెల్ రీజనల్ కో–ఆర్డినేటర్, జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య అభినందించారు. పార్టీకి పూర్వవైభవం తీసుకురావటంలో క్రియాశీలంగా పనిచేయాలని సూచించారు. శనివారం నరసన్నపేటలోని పార్టీ కార్యాలయంలో పోలాకి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, ముఖ్య నాయకుల సమక్షంలో కృష్ణచైతన్యను రాఘవరావు కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నుంచి రాష్ట్ర యువజన విభాగంలో చోటు సంపాదించుకున్న రాఘవరావుకు పోలాకి, నరసన్నపేట ఎంపీపీలు ఆరంగి మురళీధర్, ముద్దాడ బైరాగినాయుడు, పట్టణ నాయకులు చింతు రామారావు, కోరాడ గుప్త, పలు విభాగాలకు చెందిన ముఖ్య నాయకులు అభినందించారు.

4న నేత్ర వైద్య శిబిరం

కొత్తూరు: ఈ నెల 4వ తేదీన మండలంలోని మెట్టూరు బిట్–3 ఆర్‌ఆర్ కాలనీ ఎంపీపీ పాఠశాల వద్ద ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆర్‌ఆర్ కాలనీ సర్పంచ్ కొయిలాపు శ్రీనివాసరావు శనివారం తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్య నిపుణులు సేవలు అందిస్తారన్నారు. ఈ శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

సంక్షిప్తంగా

ఆటోలకు క్యూర్ కోడ్ స్టిక్కర్ల ఏర్పాటు


ఆటోలకు క్యూర్ కోడ్ స్టిక్కర్లు అంటిస్తున్న ఎస్‌ఐ బాలరాజు

ఆమదాలవలస: ఆటోల్లో ప్రయాణించేవారు సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకునేందుకు ఆటోలకు అంటిస్తున్న క్యూర్ కోడ్ ఉపయోగపడుతుందని స్థానిక ఎస్‌ఐ బాలరాజు అన్నారు. శనివారం ఆమదాలవలస పట్టణంలోని పాలపోలమ్మతల్లి ఆటో స్టాండ్‌లో గల ఆటోలకు క్యూర్‌కోడ్ స్టిక్కర్లు అంటించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఆటోలోని క్యూర్‌కోడ్‌ను సెల్‌ఫోన్‌లో స్కాన్‌చేస్తే ఆటోకు సంబంధించిన వివరాలన్నీ వస్తాయన్నారు.

సర్టిఫికెట్ల అందజేత


సర్టిఫికెట్లతో విద్యార్థులు

ఆమదాలవలస: పట్టణంలోని లక్ష్మీనగర్ భజన మండలి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో 45 రోజులుగా శిక్షణ పొందిన కంప్యూటర్ విద్యార్థులు, సంగీతంలో శిక్షణ, టైలరింగ్‌లో శిక్షణ పొందిన 72 మందికి సత్య సాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు శనివారం సర్టిఫికెట్లను అందజేశారు. జోనల్ కన్వీనర్ ఎం.జనార్ధన్ సాయి అధ్యక్షత వహించారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి బోయిన నరసింహమూర్తి మాట్లాడుతూ జిల్లాలో 5 శాశ్వత స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లలో లక్ష్మీనగర్ కూడా ఉండడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఇన్‌చార్జి ఎం.రవీంద్రబాబు మాట్లాడుతూ.. త్వరలో మెట్టక్కివలస సమితిలో కూడా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


ప్రథమ చికిత్స అందిస్తున్న 108 సిబ్బంది

సారవకోట: మండలంలోని వడ్డినవలస గ్రామానికి సమీపంలో శనివారం రోడ్డు జరిగింది. ఈ ప్రమాదంలో పాతపట్నం గ్రామానికి చెందిన ఆర్.వెంకటరమణ తీవ్రంగా గాయపడ్డారు. పాతపట్నం నుంచి నరసన్నపేట వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వడ్డినవలస సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించడంతో సిబ్బంది నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విత్తన ఎంపిక కీలకం


మాట్లాడుతున్న శాస్త్రవేత్త బాలకృష్ణ

సరుబుజ్జిలి: రైతులు వ్యవసాయ సాగులో విత్తనం ఎంపిక సక్రమంగా చేసుకోవాలని కేవీకే శాస్త్రవేత్త చింతాడ బాలకృష్ణ తెలిపారు. వికసిత కృషి సంకల్పిత అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఇస్కలపాలెంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం సాంకేతిక వ్యవసాయ పోకడలపై అవగాహన కల్పించారు. ముంపు తట్టుకొనే విత్తనాలు వేసుకోవాలని సూచించారు. వ్యవసాయంతోపాటు అనుబంధరంగాలైన పశుపోషణ, కోళ్లు, చేపల పెంపకం, కూరగాయల సాగు వలన ఆదాయం వృద్ధి చెందుతుందని వెల్లడించారు. ఈ సదస్సులో శాస్త్రవేత్తలు కిరణ్‌గాంధీ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

ఎల్.ఎన్.పేట: రేషన్ దుకాణాల ద్వారా సరుకులు పంపిణీకి ఏర్పాట్లు పూర్తిచేశామని, ఎవరైనా అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తహసీల్దారు జె.ఈశ్వరమ్మ అన్నారు. శనివారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. రేషన్ సరుకులు పంపిణీ చేసే సమయంలో అక్రమాలు జరిగినా, ఇబ్బందులు ఉన్నా తనకు, సీఎస్‌డీటీకి ఫిర్యాదు చేయాలని సూచించారు. మండలంలోని 36 రేషన్ డిపోల ద్వారా 10,961 రేషన్ కార్డుదారులకు ఈ నెల ఒకటి నుంచి 15వ తేదీ వరకు సరుకులు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు సరుకులు పంపిణీ చేయాలన్నారు.

5న జాతీయ లోక్ అదాలత్


మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి వాణి

నరసన్నపేట: ఈ నెల 5వ తేదీన నరసన్నపేట కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి ఎస్. వాణి శనివారం తెలిపారు. కేసులు అధికంగా పరిష్కారం అయ్యేందుకు వీలుగా శనివారం కోర్టులో అవగాహన సమావేశం నిర్వహించారు. అదాలత్‌ను వినియోగించుకోవాలని పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కరించుకొవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులు అధిక సంఖ్యలో పరిష్కారం అయ్యేలా పోలీసులు, న్యాయవాదులు కృషి చేయాలన్నారు. ఏపీపీ సంతోషి, న్యాయవాదులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పిడుగు పడి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం


ట్రాన్స్‌ఫార్మర్‌ను బాగుచేస్తున్న విద్యుత్ సిబ్బంది

సరుబుజ్జిలి: మండల కేంద్రంలో గల విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్‌పై పిడుగు పడి ధ్వంసమైంది. ఈ ఘటన శనివారం సాయంత్రం జరిగింది. చాలా సమయం విద్యుత్ నిలిచి పోవడంతో సరుబుజ్జిలి గ్రామ వాసులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. అనంతరం సరుబుజ్జిలి ట్రాన్స్‌కో ఏఈ చొరవతో వేరొక లైన్ ద్వారా రాత్రి 9 గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

4న వెన్నుపోటు దినం

- పోస్టర్ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి


వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, నాయకులు

పాతపట్నం: సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను నట్టేట ముంచిన కూటమి ప్రభుత్వం చర్యలకు నిరసనగా వైఎస్సార్‌సీపీ ఈ నెల 4వ తేదీన వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహిస్తోందని పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తెలిపారు. పాతపట్నంలోని క్యాంప్ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి వెన్నుపోటు దినం పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను నమ్మించి మోసం చేసిందన్నారు. అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా సూపర్ సిక్స్ హామీల అమలుకు అడుగులు వేయలేదన్నారు. ముఖ్యంగా అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్ వంటి పథకాలు అమలు చేయకుండా రైతులు, మహిళలు.. ఇలా అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. యువతకు ఈ ప్రభుత్వం చేసిన ద్రోహం అంతాఇంతా కాదన్నారు. అందుకే కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, కూటమి పార్టీల నేతల మోసాన్ని వివరించేందుకు వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అన్నివర్గాల ప్రజలు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఐటీ వింగ్ విభాగం అధ్యక్షుడు ఎనుగుతల సూర్యం, పార్టీ సీనియర్ నాయకులు ఎం.తాతయ్య, యరుకొల వెంకటరమణ, టంకాల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం


పొందూరు: క్యూలో ఉన్న భక్తులు

పొందూరు: మండలంలోని బురిడికంచరాం గ్రామంలో 46 అడుగుల గణపతి సుబ్రహ్మణ్యం సహిత ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సీతారాముల కళ్యాణం, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, స్వామివారి ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగాయి. ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద, పురోహితులు వేమూరి రామకృష్ణ శర్మ, వేమకోటి శ్రీధర్ శర్మలు శ్రీరామ భక్తులతో, ప్రజలతో పూజలు చేయించారు. ముఖ్య అతిథిగా వచ్చిన హనుమాన్ ఉపాసకులు అన్నదాన చిదంబరం స్వామి హనుమాన్ జీవిత చరిత్రను వివరించారు. రామానంద పరమహంస హిందువుల పవిత్రతను వివరించారు. అనంతరం మహా అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తుల తిరువీధి నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యేలు కూన రవికుమార్, ఎన్.ఈశ్వరరావు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ హాజరయ్యారు.

కోవిలాం గ్రామంలో..

ఎల్.ఎన్.పేట: మండలంలోని కోవిలాం గ్రామంలో నిర్మించిన క్షీరరామలింగేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. మూడు రోజులపాటు ప్రత్యేక హోమాలు, సామూహిక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిష్ఠ మహోత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన పరిసర గ్రామాలకు చెందిన భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు.